AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

పోషకాహారం అందించాలి

2

2

గెస్ట్ లెక్చరర్లకు వేతనవెతలు

రేపు నెట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికలు

అక్షరటుడే, ఇందూరు: జిల్లాకేంద్రంలో ఈనెల 17న జూనియర్స్ (అండర్ 19) బాలబాలికల జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రమేష్ తెలిపారు. నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఎంపికలు తిర్మన్‌పల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో ఉదయం 10 గంటలకు ఉంటాయన్నారు. 2007 మార్చి 31 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు పోటెత్తిన వరద..

అక్షరటుడే, బాల్కొండ : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తింది. జలాశయంలోకి 1.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి భారీగా ప్రవాహం వస్తుండటంతో అధికారులు దిగువకు నీటి విడుదలను పెంచారు. 36 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 2,32,128 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.30 అడుగుల (77.40 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎస్సారెస్పీ నుంచి 36 వరద గేట్ల ద్వారా 2,32,128 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, వరద కాలువకు 8 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, లక్ష్మి కాలువకు 200, సరస్వతి కాలువకు 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలీసాగర్‌కు 180, మిషన్ భగీరథకు 231, ఆవిరి రూపంలో 701 క్యూసెక్కులు పోతోంది. మొత్తం ఔట్ ఫ్లో 2,50,240 క్యూసెక్కులుగా ఉంది.

నిజాంసాగర్‌కు పెరుగుతోన్న వరద

అక్షరటుడే, ఎల్లారెడ్డి: నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. 56,992 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించి తొమ్మిది గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు ఎగువ, దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మొత్తంగా 62,542 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సింగూరు ప్రాజెక్టుకు సైతం ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టులోకి 35వేల క్యూసెక్కుల వరద ఎగువ నుంచి వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈరోజు రాత్రి 9 గంటలకు ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతామని సింగూరు ప్రాజెక్టు అధికారులు సమాచారమిచ్చారు. ముఖ్యంగా పశువుల కాపర్లు నది పరీవాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచించారు. జాలర్లు నదిలోకి వెళ్లవద్దని సింగూరు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భీమ్ పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో భారీవర్షం..

ఆర్మూర్ పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో హెచ్‌పీ పెట్రోల్ పంప్, తిరుమల ఆస్పత్రి ప్రాంతంలో రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. దీంతో అరగంట సేపు వాహనాల రాకపోకలు స్తంభించాయి. - అక్షరటుడే, ఆర్మూర్

పోలీసుల పహారాలో తాళ్లరాంపూర్

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రధాన ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గ్రామంలో వీడీసీ, గౌడ కులస్థులకు మధ్య జరుగుతున్న తగాదాలు తారాస్థాయికి చేరుకోవడంతో సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. గ్రామంలో వీడీసీ ఆగడాలు రోజురోజుకూ హద్దు మీరిపోయి అశాంతికి కారణమవుతున్నాయని గౌడ కులస్థులు వాపోతున్నారు. గౌడ కులస్థులను గ్రామం నుంచి బహిష్కరించడమే కాకుండా వారికి సంబంధించిన చెట్లను నరికివేయించారనే ఆరోపణలు రావడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనిని కవర్ చేసేందుకు వెళ్లిన ఓ ఛానల్ విలేకరిపై దాడి చేయడంతో పరిస్థితి మరింత ముదిరింది. దీంతో పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున పోలీసులు గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా వేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రజలు పలువురు ఎమ్మెల్యేలను నేరుగా కలవలేని పరిస్థితి నెలకొంది. కింది స్థాయి నాయకులకు సైతం ఎమ్మెల్యే అపాయింట్‌మెంట్ దొరకడం లేదు. వారి పీఏలే అన్ని పనులు చక్కబెడుతున్నారు. కొంత మంది పీఏలు అయితే వారే ఎమ్మెల్యేలం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పీఏల వ్యవహారం ఉమ్మడి జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. కొంతమంది వ్యక్తిగత సహాయకులు అయితే అధికారులకు ఫోన్లు చేసి సైతం పనులు చేయమని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సమాచారం. – అక్షరటుడే, కామారెడ్డి

పీఏలదే పెత్తనం!

- అధికారులకు హుకుం జారీ చేసేది వారే
- కిందిస్థాయి నాయకులు ఎమ్మెల్యేలను కలిసేందుకు నో ఛాన్స్
- ఏ పని ఉన్నా తమ ద్వారానే వెళ్లాలంటున్న వైనం

ప్రజలు తమకు ఏదైనా సాయం కావాల్సి వస్తే ఎమ్మెల్యేల వద్దకు వస్తుంటారు. ఈ క్రమంలో ఏ పనైనా తామే చేస్తామంటూ పీఏలు తేల్చి చెబుతున్నారు. నేరుగా ఎమ్మెల్యే చెప్పారని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఫలానా పని చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. కొందరు ముఖ్య నాయకులు ఎమ్మెల్యేను కలిసేందుకు ప్రయత్నించినా కలవనివ్వకుండా పీఏలు అడ్డుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. కార్యకర్తలు, నాయకులకు ఇదే విధంగా పీఏల నుంచి సమస్యలు ఎదురవుతున్నట్లు చర్చించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నాయకుడి గెలుపు కోసం కష్టపడ్డ తమకే అపాయింట్‌మెంట్ దొరకడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తమ సమస్యలు, సంతోషాలు ఎమ్మెల్యేలకు చెప్పుకునేదెలా అని పలువురు నాయకులు వాపోతున్నారు.

తెలిసే జరుగుతుందా?

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల పీఏల తీరు నాయకుల ఆగ్రహానికి కారణమవుతోంది. ఫలితంగా ఎమ్మెల్యేలు అబాసుపాలవుతున్నారన్న ప్రచారం ఓ వైపు సాగుతోంది. మరోవైపు వాళ్లకు తెలియకుండానే పీఏలు ఇంత దర్జాగా పెత్తనం చేలాయిస్తారా అనే వాదన కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజల నుంచి మొదలుకొని నియోజకవర్గ స్థాయి నేతల వరకు ఎమ్మెల్యేల పీఏల తీరుపై గుర్రుగా ఉన్నట్టుగా తెలుస్తోంది. పీఏల విషయం తెలిసినా పట్టించుకోవడం లేదా.. లేక నిజంగానే ఎమ్మెల్యేలకు తెలియకుండానే వారు సొంత ఏజెండాతో ముందుకు సాగుతున్నారా అనేది తెలియాల్సి ఉంది.

స్థానిక ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవా?

రాష్ట్రంలో త్వరలో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ అంశం కొలిక్కి వస్తే నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితా కూడా విడుదల చేసింది. అయితే ఎమ్మెల్యేల పీఏల తీరుతో స్థానిక ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. కిందిస్థాయి నాయకులు కూడా పీఏల తీరుపై ఆగ్రహంగా ఉండడంతో వారు ఎన్నికల్లో ఎలా వ్యవహరిస్తారో చూడాలి. మరోవైపు ప్రజలు సైతం నాయకులను నిలదీసే అవకాశం ఉంది. ఈ క్రమంలో పీఏల వ్యవహారంపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

టీఎన్జీవోస్ సహకార కో-ఆపరేటివ్ ఎన్నికలు

అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ సహకార నాన్ గెజిటెడ్ ఎన్నికలు మంగళవారం టీఎన్జీవోస్ కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ సహకార నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా నర్సింలు, అసోసియేట్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ అలీం, సాయినాథ్, కార్యదర్శిగా సయ్యద్ మసియోద్దీన్, జాయింట్ సెక్రెటరీలుగా రాధిక, విశ్వనాథ్, కోశాధికారిగా సృజన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సురేష్, పబ్లిసిటీ సెక్రెటరీగా విష్ణు, ఈసీ మెంబర్లుగా మమత, విజయలక్ష్మి, రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ హైదరాబాద్ మహిళా కార్యదర్శి రాజకుమారి, జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు పాల్గొన్నారు.

ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా ప్రమోషన్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఏఎస్సైలకు పదోన్నతి లభించింది. ఏఎస్సైలు బి.బాలశౌరి రాజు, దయాల్ సింగ్‌లకు ఎస్సైలుగా ప్రమోషన్ వచ్చింది. దీంతో సీపీ సాయిచైతన్య వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారికి బ్యాడ్జిలు అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రమోషన్ ద్వారా విధుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్

అక్షరటుడే, గాంధారి: మండల కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శిథిలమైన ఆర్‌అండ్‌బీ రోడ్లు, వంతెనలు, కల్వర్టులను ఆయన పరిశీలించారు. గుర్జాల్ తండా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. తర్వాత విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీవో మురళి, డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో రాజేశ్వర్, తహశీల్దార్ రేణుకా చౌహాన్, ఎంపీవో లక్ష్మీనారాయణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సాలూర తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

అక్షరటుడే, బోధన్: సాలూర మండల తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయ పరిధిలో జరుగుతున్న రెవెన్యూ పనులు.. వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార సరళిని ఆయన పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి క్లియర్ చేయాలని పెండింగ్‌లో పెట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ రికార్డులను సక్రమంగా భద్రపర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహశీల్దార్ శశిభూషణ్ తదితరులున్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అక్షరటుడే, ఇందూరు: హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని 12(టీ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రియాజిత్ సూర్ అన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హైదరాబాద్ లిబరేషన్ డే ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విమోచన దినోత్సవం కోసం పోరాడిన సంఘటనలను ఫొటో ఎగ్జిబిషన్ రూపంలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఆనాటి వ్యక్తుల గురించి తెలుసుకోవడం యువతకు ఎంతో అవసరమన్నారు. ఇప్పటి యువత అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసేందుకు పోరాడిన వీరుల పోరాటం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆనాటి వీరులు రాంజీ గోండు, కొమురంభీం, చాకలి ఐలమ్మ, బండి యాదగిరి, భాగ్యరెడ్డి వర్మ, నారాయణరావు, వందేమాతరం రామచంద్రరావు తదితర ప్రముఖుల ఫొటోలను, వారి చరిత్రను ఏర్పాటు చేశామన్నారు. బైరాన్‌పల్లి ఘటన, పరకాల మరణకాండ, బ్రిటిష్ సైన్యంపై తిరుగుబాటు, వందేమాతరం ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, ఆపరేషన్ పోలో వంటి ప్రధాన ఘట్టాలను వివరించామని తెలిపారు.

అద్భుతం.. జానకీబాయి చెరువు తూము

చెరువులో లభ్యతను బట్టి నీటిని విడుదల చేసేవిధంగా శీలం జానకీబాయి చెరువు తూము కట్టడం ఒకప్పటి ఇంజినీరింగ్ అద్భుతంగా చెప్పకోవచ్చు. వందేళ్ల క్రితం ఈ తూము నిర్మాణం జరుగగా ఇప్పటికీ ఏమాత్రం చెక్కుచెదరకుండా రైతులకు సేవలందిస్తోంది. సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి తన హయాంలో గ్రామానికి గొలుసు కట్టు చెరువులను నిర్మించింది. ప్రస్తుతం ఈ తూము నిర్మాణాన్ని చూసినవారంతా ఆనాటి ఇంజినీరింగ్ ప్రతిభకు ప్రశంసిస్తున్నారు.
– అక్షరటుడే, ఇందల్వాయి

పీఎం ఆవాస్ యోజన లబ్ధిదారుల సర్వే

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్నారు. పథకానికి అర్హత సాధించిన గ్రామీణ కుటుంబాలకు గృహనిర్మాణానికి సాయం చేస్తామని ఎంపీడీవో ప్రకాశ్ పేర్కొన్నారు. మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో మంగళవారం లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. గ్రామీణ లబ్ధిదారులకు కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అయితే పట్టణ ప్రాంతాలకు 2022లో పథకం గడువు ముగియగా.. డిసెంబర్ 2025 వరకు పొడిగించారు. ఇళ్లను పూర్తి చేయడానికి, అవగాహన పెంచడానికి, పథకం అమలును వేగవంతం చేయడానికి అంగీకార్-2025 పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీర్కూర్ సహకార సంఘం ఇన్‌ఛార్జి ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ

అక్షరటుడే, బాన్సువాడ: బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా ఇంగు రాములు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యదర్శి విఠల్ ఆయనకు ఉత్తర్వుల కాపీ అందజేసి బాధ్యతలు అప్పగించారు. నూతన ఛైర్మన్‌కు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సహకార సంఘం సిబ్బంది అభినందించారు. అనంతరం ఇంగు రాములు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, రైతుల సహకారంతో సహకార సంఘాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ యామ రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీపీ రఘు, మాజీ ఎంపీటీసీ సందీప్, శశికాంత్, అంబలి బసవరాజ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 16 మంది జీపీవోలు

అక్షరటుడే, బోధన్: మండలంలో 16 మంది జీపీవోలు విధుల్లో చేరారు. వీరు గతంలో రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా విధులు నిర్వహించారు. తాజాగా వీరు జీపీవోలుగా మంగళవారం విధుల్లో చేరారు. బోధన్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఐదుగురు జీపీవోలుగా బాధ్యతలు స్వీకరించారు. మండలానికి సంబంధించి 11 మంది విధుల్లో చేరినట్లు తహశీల్దార్ విఠల్ పేర్కొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

అక్షరటుడే, భీమ్‌గల్: చిన్నారులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూరు గ్రామ రైతువేదికలో మంగళవారం భీమ్‌గల్, వేల్పూర్ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పోషణ-చదువు అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాభ్యాసంతో పాటు పోషకాహారం అందించాలన్నారు. ఇందులో భాగంగానే బాల్య ఆరంభ దశ విద్యాభివృద్ధికి మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు పౌష్టికాహారం, శారీరక, మానసిక ఎదుగుదలకు విద్య, ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శిక్షకులు శారద, విజయరాణి, పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: నియోజకవర్గంలో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరామర్శించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్ పేట్‌కు చెందిన రాజంపేట పోచయ్య అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన రాజంపేట యాదగిరి విద్యుదాఘాతంతో గాయపడగా.. పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వెంకంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సుభాకర్ రెడ్డి తల్లి, జలాల్ పూర్ మాజీ సర్పంచ్ ధారబోయిన కృష్ణ తల్లి మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట నాగిరెడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు గుర్రాల సిద్దయ్య, వంశీకృష్ణ గౌడ్, మంగళ యాదగిరి, సంతోష్ గౌడ్, వెంకటరెడ్డి, హనుమంత్ రెడ్డి, కాంత్ రెడ్డి, మోతె శ్రీనివాస్, ఫరీద్, లక్ష్మీ కాంతం, తదితరులున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో కలిపి దాదాపు 1,654 మంది పని చేస్తుండగా, వీరిలో 398 పోస్టులకు మాత్రమే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఫైనాన్స్ అప్రూవల్ ఇచ్చింది. దీంతో మిగిలిన అధ్యాపకులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

- అక్షరటుడే, కమ్మర్‌పల్లి

అతిథి అధ్యాపకులు ఇటీవల మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామిని కలిశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు, 1,654 మందిని విధుల్లోకి తీసుకుని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

అతిథి అధ్యాపకులకు వేతన వెతలు..

▸ కొన్ని నెలలుగా అవస్థలు ▸ తమను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వేడుకోలు

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పదేళ్లుగా అతిథి అధ్యాపకులు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారు. అయితే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అంతేగాక, కాంగ్రెస్ పార్టీ మేని ఫెస్టోలోనూ అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా.. గెస్ట్ లెక్చరర్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వారు వాపోతున్నారు. దీనికితోడు 1,654 పోస్టులకు గాను.. కేవలం 398 పోస్టులకి ఫైనాన్స్ అప్రూవల్ ఇవ్వడంతో, మరింత ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడిన 18 కళాశాలల్లో ఆర్‌జేడీ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల డీఐఈవోలు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినప్పటికీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి వీరికి అప్రూవల్ రాలేదు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా ప్రభుత్వం కరుణించడం లేదని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

కుటుంబపోషణ భారం..

పది నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం వెంటనే వేతనాలను మంజూరు చేసి మమ్మల్ని ఆదుకోవాలి. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

– శ్రీహరి, అతిథి అధ్యాపకుడు

ఉద్యోగం లేక రోడ్డున పడ్డాం..

కొన్నేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నాం. ఈరోజు మా పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మాకు రెన్యూవల్ కాకపోవడంతో ఏం చేయాలో తోచడం లేదు. ఇటు వేతనాలు లేక, ఉద్యోగం నుంచి తొలగించడంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

– సురేష్, అతిథి అధ్యాపకుడు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అక్షరటుడే, భీమ్‌గల్: పట్టణంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వామి మంగళవారం పంపిణీ చేశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన తమకు సీఎంఆర్ఎఫ్ మంజూరు కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్‌కు ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనంతరావు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్లెల రాజశ్రీ, మల్లెల లక్ష్మణ్, సుంకరి సురేష్, మహేష్, నల్లూరి శీను, దినేష్, రాము, గంగమణి, ఎంకమ్మ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో గౌడ కులస్థుల నిరసన

అక్షరటుడే, ఆర్మూర్: ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో గౌడ కులస్థులపై వీడీసీ వేధింపులను నిరసిస్తూ జిల్లా గౌడ సంఘం, జిల్లా గౌడ యువసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిజాంసాగర్ కెనాల్ కట్టపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, అంజా గౌడ్, సంజీవ్ గౌడ్ పాల్గొన్నారు.

గుడి డబ్బులు వడ్డీతో సహా చెల్లిస్తా

అక్షరటుడే, బాన్సువాడ: బీర్కూర్ తెలంగాణ తిరుమల దేవస్థానానికి సంబంధించి రూ.25 లక్షలు వడ్డీతో సహా చెల్లిస్తానని, కాని తనకు రావాల్సిన ఫండ్‌ను అడ్డుకుంటున్నారని బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ పేర్కొన్నారు. బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు వడ్డీ కింద రూ.30 లక్షలు తీసుకున్నానని, అందులో రూ.5 లక్షలు వడ్డీతో సహా చెల్లించానని తెలిపారు. కాని తనకు రావాల్సిన బిల్లులు ఆపి ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. కాని అభివృద్ధి పనుల్లో భాగంగా నేను చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఆపారని.. వాటిని ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాకు రావాల్సిన బిల్లులు ఇప్పిస్తే దేవస్థానం డబ్బులు మొత్తం చెల్లిస్తానని స్పష్టం చేశారు. రూ.1.10 కోట్లు డబుల్ బెడ్ రూమ్ బిల్లులు రావాల్సి ఉన్నాయని, రూ.70లక్షలు ఎస్‌డీఎఫ్ డబ్బులు రావాల్సి ఉన్నాయన్నారు. నాకు రావాల్సిన బిల్లులు ఆపలేదని గుడిలో తడిదుస్తులతో ప్రమాణం చేద్దామని ఎమ్మెల్యేకు సతీష్ సవాల్ విసిరారు. గుడి డబ్బులు కాజేశానని సోషల్ మీడియాలో నాపై తప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నాకు రావాల్సిన బిల్లులు రాకుండా ఎమ్మెల్యే పోచారం అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ స్వరూప శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అంజవ్వ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ అంజయ్య, మారుతి, సాయి శ్యామ్, ఓంకార్, రామకృష్ణారెడ్డి, మోహన్, సాయిలు, పీరుగొండ, మోహన్ నాయక్ సంగ్రామ్ నాయక్, గాదె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు

అక్షరటుడే, ఇందూరు: తెలంగాణ సాయిధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. ముబారక్ నగర్‌లోని బీడీ కంపెనీలో మంగళవారం తెలంగాణ రైతాంగ పోరాట విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదన్నారు. నిజాం నవాబుకు తాబేదారులుగా ఉన్న దొరలు, భూస్వాములు, పటేల్ పట్వారీలు, జాగీర్దారులు, జమీందార్లు పేదలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ దౌర్జన్యం చేశారన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వచ్చి కమ్యూనిస్టుల నాయకత్వంలో సంఘాలను ఏర్పాటు చేసుకొని కులమతాలకు అతీతంగా దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. మూడువేల పల్లెల్లో గ్రామ స్వరాజ్యం ఏర్పాటు చేశారన్నారు. పోరాటంలో 2,500 మంది పేదలు, కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఇంతటి చరిత్ర కమ్యూనిస్టులకు ఉంటే దాన్ని వక్రీకరణ చేస్తున్న బీజేపీ విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, నాయకులు సాయిలు, మోహన్, ఖాదర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణపై అవగాహన సదస్సు

అక్షరటుడే, బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ మాట్లాడారు. ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించి, భూమిపై జీవావరణ సమతుల్యతను కాపాడడంలో దాని పాత్రను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ పరిరక్షణ అందరి ధ్యేయంగా ఉండాలని, ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో మోహన్ రావు, చిరంజీవి, సీహెచ్. భగవాన్ రెడ్డి, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని మోగులాన్‌పల్లిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలు, తండాల్లో ప్రజలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి అవసరమైన వైద్యసేవలు అందజేస్తామని చెప్పారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం

అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్ నగర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు మొత్తం 20 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. ఇందులో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కార్యదర్శి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాల సందర్భంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ రూ.18వేల విలువైన క్రీడా దుస్తులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటాలని.. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నరేందర్, పీడీ రాజేష్, మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, కుర్మె ముత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయాల్లో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల నాయకులు తెలిపారు. అన్ని మండలాల్లోని పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. అలాగే తెలంగాణ విమోచన దినోత్సవం, భారత ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి రక్తదానం చేయాలని కోరారు. అలాగే అన్ని మండలాల నుంచి తిరంగా బైక్ ర్యాలీ తీయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.